సాక్షి నిజామాబాద్

మంగళవారం । 9 । జనవరి । 2024



సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదైన ప్రతి సమస్యకు తక్షణమే పరిష్కారాన్ని చూపాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు.

- 8లో ▸



కేంద్ర పథకాలతో లబ్ధి..

కేంద్ర పథకాలతో అర్హులు లబ్ధి పొందాలని ఆహారం ప్రజాపంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి అశ్విని శ్రీవాస్తవ పేర్కొన్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.4 /17.7

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉదయం నుంచి చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అవినీతి అక్రమాలపై విచారణ జరిపించండి



మోర్తాడ్(బాల్కొండ) : గత ప్రభుత్వ హయాంలో బాల్కొండ నియోజకవర్గంలో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని దోషులను శిక్షించాలని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గం ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డితో విన్నవించారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎంను ఆయన నివాసంలో సునీల్‌రెడ్డి కలుసుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలతో పాటు, గత పాలకుల నిర్లక్ష్యం, అవినీతి, అక్రమాల వల్ల ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులపై ఫిర్యాదు చేశారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించినట్లు సునీల్‌రెడ్డి వెల్లడించారు.

సైనిక సంక్షేమానికి విద్యార్థుల చేయూత అభినందనీయం

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



నిజామాబాద్‌నాగారం : ప్రాణాలను పణంగా పెట్టి దేశరక్షణలో సైనికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని, వారి సంక్షేమం కోసం సత్యశోధక్ విద్యార్థులు విరాళాలు సేకరించి చేయూతనివ్వడం అభినందనీయమని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుకు రూ. 50 డీడీని సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం జమచేసిన విరాళాన్ని అందజేశారు.అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, డీఈవో దుర్గాప్రసాద్, నిజామాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేంద్రప్రసాద్, ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి రమేశ్, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్ నర్సయ్య, గంగామోహన్ సతీష్ ఉన్నారు.

ఎమ్మెల్యేలకు 'పార్లమెంట్' బాధ్యతలు



సుభాష్‌నగర్ : అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకు కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి బాధ్యతలు అప్పగించారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర పదాధికారుల సమావేశం నిర్వహించారు. కరీంనగర్ పార్లమెంట్‌లో మరోసారి బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా పైడి రాకేశ్‌రెడ్డిని నియమించారు.

నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా..

నిజామాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జిగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు.

ఊరికెళ్తున్నారా.. జాగ్రత్త

- సీపీ కల్మేశ్వర్

ఖలీల్‌వాడి : సంక్రాంతి పండగ సందర్భంగా కుటుంబాలు ఊళ్లకు వెళ్తే జాగ్రత్తలు పాటించాలని సీపీ కల్మేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విలువైన వస్తువులైన బంగారం, డబ్బులను ఇంట్లో ఉంచవద్దన్నారు. తప్పనిసరై ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే సమీప పోలీస్‌స్టేషన్లలో సమాచారం ఇవ్వాలన్నారు. సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయా లేదా చెక్ చేసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులు శివారు ప్రాంతాల్లో ఉండే ఇళ్లను ఉదయం వేళల్లో వెతికి రాత్రివేళ చోరీలకు పాల్పడుతారన్నారు. పక్కింటి వారి ద్వారా తమ ఇంటి సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు.

పంటసాగు వివరాలు సక్రమంగా నమోదు చేయాలి



డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : యాసంగి పంటల సాగు వివరాలను ఏఈవోలు సక్రమంగా నమోదు చేయాలని డీఏవో వాజిద్ హుస్సేన్ సూచించారు. సోమవారం డిచ్‌పల్లి మండలం నడిపల్లి రైతువేదికలో జిల్లాలోని ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులు, ఏఈవోలతో డీఏవో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏఈవోలు క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల నమోదు సకాలంలో పూర్తి చేయాలన్నారు.



ఓటర్ జాబితా ముసాయిదా రెడీ

పార్లమెంట్ ఎన్నికల కోసం ఓటర్ జాబితా ముసాయిదాను ఇటీవల అధికారులు విడుదల చేశారు. ఇందుకు సంబంధించిన లిస్టులు కలెక్టరేట్‌కు చేరుకున్నాయి. దీంతో రెవెన్యూ సిబ్బంది డివిజన్ల వారీగా వేరుచేస్తూ జాబితాను సిద్ధం చేస్తున్నారు. వీటిని ఎంపీడీవో, తహసీల్దార్, పంచాయతీ, మున్సిపల్ కార్యాలయాలకు తరలిస్తారు. అక్కడ అందుబాటులో ఉంచుతారు. ఓటర్ లిస్టులో ఏవైనా అభ్యంతరాలుంటే స్థానిక అధికారులకు విన్నవించుకోవచ్చు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఓటర్ల లిస్టులను నియోజకవర్గాల వారీగా సరిచేస్తున్న రెవెన్యూ అధికారులు

సారూ.. పింఛన్ ఇప్పించరూ..

'నాకు ఎవలూ లేరు.. పింఛిని రాక తిప్పలైతుంది.. గతంలో అస్తుండే.. మధ్యల ఆగిపోయింది.. ఎవలిని అడిగినా పట్టించుకంటలేరు.. మీరైనా దయ చూపించుండ్రి సారూ..' అంటూ నగరంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన వృద్ధురాలు మేకల లక్ష్మి కలెక్టరేట్‌కు తరలివచ్చింది. తనకు పింఛన్ ఇప్పించాలంటూ కన్నీరుమున్నీరైంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



పింఛన్ ఇప్పించండి అని కలెక్టరేట్‌కు వచ్చిన వృద్ధురాలు మేకల లక్ష్మి

జమీర్‌కు రాజకీయ అండ!

- సెల్‌ఫోన్ రిపేరర్ నుంచి అంతర్రాష్ట్ర మట్కా నిర్వాహకుడిగా ఎదిగిన నిందితుడు
- ఐదేళ్లుగా అక్రమ దందా
- రాజకీయ నేతలతో పాటు పోలీసుల అండ?
- పోలీసుల విచారణలో బయటపడుతున్న నమ్మలేని నిజాలు



ఖలీల్‌వాడి: సెల్‌ఫోన్ రిపేరర్ నుంచి అంతర్రాష్ట్ర మట్కా నిర్వాహకుడిగా నిజామాబాద్ నగరానికి చెందిన మహమ్మద్ జమీర్ ఎదగడానికి తెర వెనుక ఉన్న రాజకీయ నాయకులు, పోలీసుల హస్తంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూపీ లాగుతున్నారు. అనతికాలంలో సులువుగా డబ్బు సంపాదించాలని జమీర్ వక్రమార్గాన్ని ఎంచుకున్నాడు. ఆదివారం జమీర్‌ను అరెస్టు చేసిన పోలీసులు విచారిస్తున్నారు. వారి విచారణలో విస్మయమైన విషయాలు బహిర్గతమవుతున్నట్లు తెలుస్తోంది. సెల్‌ఫోన్, ఆన్‌లైన్‌పై అవగాహన కలిగిన జమీర్ కొంత మంది బుకీల ద్వారా అంతర్రాష్ట్ర మట్కా ఏజెంట్లను నియమించుకుని మట్కా జూదాన్ని కొనసాగించినట్లు పోలీసులు గుర్తించారు. పోలీసు కమిషనర్ కల్మేశ్వర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఇల్లీగల్ దందాలపై దృష్టి సారించారు. ఈ మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గంజాయి, పీడీఎస్ బియ్యం స్మగ్లింగ్, మట్కా, పేకాట స్థావరాలపై దాడుల జోరు పెంచారు. ఈ క్రమంలోనే జమీర్ పట్టుబడ్డాడు. ఐదేళ్లుగా తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో పెద్ద ఎత్తున మట్కాను జమీర్ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. జమీర్ బుకీల ద్వారా అనేకమంది అమాయక ప్రజలను మట్కా ఉచ్చులోకి లాగాడని, రూ.కోట్లలో లావాదేవీలు జరిగేవని తెలుస్తోంది.

బ్లాక్ చేసిన నంబర్‌తోనే..

మట్కా నిర్వాహణలో ముందుగానే కొన్ని నంబర్‌లను బ్లాక్ చేస్తారు. మిగిలిన నంబర్‌లపై వివిధ ప్రాంతాల నుంచి బుకీలు, ఏజెంట్లు డబ్బులు చెల్లించగానే జమీర్ బ్లాక్ చేసిన నంబర్లపై బినామీల ద్వారా డబ్బు కట్టేవాడు. ఇలా ఐదేళ్లలో రూ. కోట్లలో అక్రమార్జన చేసినట్లు పోలీసు వర్గాల ద్వారా సమాచారం తెలుస్తోంది. జమీర్ ఆస్తులపై పోలీసులు ఆరా తీస్తున్నారు. నిందితుడి ముఖ్య అనుచరుల కోసం గాలిస్తున్నారు.

విచారణలో..

జమీర్ ఒకడే అంతర్రాష్ట్ర మట్కా నిర్వాహణ ఎలా చేస్తాడని? దీని వెనుక ఎవరి హస్తం ఉన్నది ? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల విచారణలో నమ్మలేని నిజాలు బయటకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే జమీర్ వెనక ఇద్దరు రాజకీయనేతలు ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. జమీర్‌కు రాజకీయ నేత ఒకరు అత్యంత సన్నిహితుడిగా తెలిసింది. ప్రస్తుతం అతను పరారీలో ఉన్నట్లు సమాచారం. కాగా ఇద్దరు నేతలు, పోలీసులతో పాటు గతంలో పని చేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులను మేనేజ్ చేయడంతోనే ఈ గుట్టు ఇప్పటి వరకు బయట పడలేదని ప్రచారం సాగుతోంది. విచారణ సమగ్రంగా జరిగితే జమీర్‌కు అండగా నిలిచిన పోలీసులు, నేతల వివరాలు బహిర్గత మవుతాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

మూడు రాష్ట్రాలలో..

మహారాష్ట్రలోని నాందేడ్, ధర్మాబాద్, బిలోలి, వార్ధా, అకోలా, ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, తెలంగాణలోని నిజామాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాలలో జమీర్ మట్కా నిర్వాహకులతో ఆన్‌లైన్‌లో మట్కా నడిపేవాడని తెలుస్తోంది. మట్కా ఫలితాన్ని ముందే తెలుసుకుని

తన బినామీలతో డబ్బులు పెట్టించి ప్రతిరోజు రూ.లక్షలలో డబ్బులు పొందేవారని పోలీసులు చెబుతున్నారు.

ఐక్యత లేకే ఓటమి

నిజామాబాద్ నాగారం : మాజీ ఎమ్మెల్యేల పనితీరు సక్రమంగా లేకపోవడం..కార్యకర్తలను దూరంపెట్టడం వల్లే పార్టీ అధికారంలోని రాలేదని, ఇకనైనా ఐక్యంగా ఉండి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత అన్నారు. సోమవారం తెలంగాణ భవన్‌లో జరుగుతున్న బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జిల్లాలో విబేధాలను పక్కన పెట్టాలన్నారు. అందరినీ కలుపుకొని పోవాలన్నారు. కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీ ఆదేశాలను పాటించాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ జనరల్ సెక్రెటరీ కేశవరావు, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ కేఆర్ సురేష్ రెడ్డి, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న కేటీఆర్

గడువులోపు సీఎంఆర్ లక్ష్యాన్ని సాధించాలి

- వీసీలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

సుభాష్‌నగర్ : నిర్దిష్ట గడువులోపు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) లక్ష్యాన్ని సాధించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కలెక్టర్లకు సూచించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, పౌర సరఫరాల శాఖ ఉన్నతాధికారులతో కలిసి మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో సీఎంఆర్ ప్రగతిపై సమీక్షించారు. రైస్‌మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని వేగవంతంగా మిల్లింగ్ జరిపించి, కోటా మేరకు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి బియ్యం నిల్వలు చేరవేసేలా పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. డిసెంబర్ 31 నాటికే ఎఫ్‌సీఐకి సీఎంఆర్ కోటా చేరవేయాల్సి ఉన్నా అనేక జిల్లాల్లో మిల్లింగ్ ప్రక్రియ పెండింగ్‌లో ఉందన్నారు. ఈనెల 21 వరకు ఎఫ్‌సీఐ గడువు పొడిగించినందున, నిర్ణీత సమయంలోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలు చేరేలా చూడాలన్నారు. పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్‌ను నిరోధించాలని, రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా గట్టి నిఘా ఉంచాలన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

దరఖాస్తులు అప్‌లోడ్ చేయాలి : సీఎస్

ప్రజాపాలన అభయహస్తంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సకాలంలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కలెక్టర్లకు సూచించారు. ఈవిషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ ప్రజాపాలన కార్యక్రమం ద్వారా జిల్లాలో మొత్తం 4,76,321 దరఖాస్తులు వచ్చాయని సీఎస్ దృష్టికి తెచ్చారు. వాటిలో ఇప్పటికే 1,49,953 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, ప్రతిరోజూ కనీసం 60 వేల దరఖాస్తులు అప్‌లోడ్ చేసేలా చర్య లు తీసుకున్నామన్నారు. ఈనెల 17లోపు పెండింగ్ లేకుండా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేయిస్తామన్నారు. ప్రజాపాలన సక్సెస్‌పై కలెక్టర్లను అభినందించారు. వీసీలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, డీఎస్ఓ చంద్రప్రకాష్ తదితరులున్నారు.

కార్పొరేటర్ కబ్జాగిరి..!

- ప్రభుత్వ భూమిని ఆక్రమించిన ప్రజాప్రతినిధి
- దర్జాగా నిర్మాణాలు.. పర్యవేక్షణ మరిచిన అధికారులు
- ప్రజావాణిలో ఫిర్యాదులు



నగరంలోని 7వ డివిజన్‌లో పీఎఫ్, ఈఎస్ఐ ఆస్పత్రి వెనుక భాగంలో కబ్జా చేసిన ప్రభుత్వ భూమి

నిజామాబాద్ నాగారం : ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు..కబ్జా చేసేస్తున్నారు కార్పొరేటర్లు.. నగరంలో విచ్చలవిడిగా కబ్జాల పర్వం నడుస్తున్నప్పటికీ బల్దియా ఉన్నతాధికారులు మాత్రం మాకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. మరికొందరు అధికారులేమో కబ్జాలో తామూ భాగమై మామూళ్లు తీసుకుని కళ్లు మూసుకుంటున్నారు.నగరంలోని 8వ డివిజన్ కార్పొరేటర్ కబ్జాలకు పాల్పడుతున్నాడని పేర్కొంటూ నేరుగా సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు ఫిర్యాదు చేశారు.

వివరాల్లోకి వెళ్తే..

నగరంలోని 7వ డివిజన్‌లో పీఎఫ్, ఈఎస్ఐ ఆస్పత్రి వెనుక భాగంలో ప్రభుత్వ భూమిని స్థానిక కార్పొరేటర్ కబ్జా చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అదీకాక కబ్జా చేసిన భూమిని డబ్బులకు ఇతరులకు అమ్మేశాడని పేర్కొంటున్నారు. సర్వే నం.1684, 1685లో ప్రభుత్వ భూమి సుమారు 10 ఎకరాలకు పైనే ఉంది. ఇక్కడ భూమి విలువ సుమారు రూ. 20వేల పైనే గజం విలువుంది. ఒక్క కార్పొరేటరే సుమారు 800 గజాల భూమి కబ్జా చేసి చుట్టు కంచె వేయడం విస్మయానికి గురి చేస్తోందంటున్నారు.

చిన్నపాటి వాగ్వాదంతో..

గతనెల డిసెంబర్ 18న ఇదే ప్రాంతంలో కార్పొరేటర్‌కు గుడిపక్కన ఉన్న ఇంటి సభ్యులకు వాగ్వాదం జరిగింది. కాలనీలో రోడ్డు వేయిస్తున్నామని చెప్పి గుడికి సంబంధించి బోరు వాడుకుని పాడు చేశారని, అలాగే ఎక్కడో రోడ్డేస్తే తమ కాలనీలో సిమెంట్, కంకర, ఇసుక వేయడంతో దుమ్ము, ధూళితో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులమంతా సదరు కార్పొరేటర్‌కు చెబితే తమను దుర్భాషలాడుతూ, తన అనుచరులతో దాడులు చేయించాడని వారు ఆరోపిస్తున్నారు. ఓట్లేసి గెలిపిస్తే మాపైనే దాడులు చేయడంపై కాలనీవాసులు ఆవేదన చెందుతూ బల్దియాలో ఫిర్యాదు చేశామని, అది పెండింగ్‌లోనే ఉందన్నారు. అనంతరం సోమవారం ప్రజావాణిలో 7వ డివిజన్ కార్పొరేటర్ కబ్జాలకు పాల్పడుతున్నాడని పేర్కొంటూ ఫిర్యాదు అందజేశారు.

ఏసీబీ వలలో ట్రాన్స్‌కో ఏఈ

- అద్దె వాహనం బిల్లులకు రూ.12,500 లంచం డిమాండ్
- కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు



విచారణ జరుపుతున్న ఏసీబీ అధికారులు



నిందితుడు ఏఈ రాజు

కామారెడ్డి క్రైం: అద్దె వాహనానికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల విషయంలో డబ్బులు డిమాండ్ చేసిన ఓ ట్రాన్స్‌కో ఏఈని ఏసీబీ అధికారులు వల పన్ని పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బీబీపేటకు చెందిన సయానీ రాజు కామారెడ్డిలో నివాసం ఉంటూ ట్రాన్స్‌కో(132 కేవీ లైన్స్)లో ఏఈగా పనిచేస్తున్నాడు. జిల్లా కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో ట్రాన్స్‌కో కార్యాలయం ఉంది. భారీ టవర్ల మీదుగా ఉండే పెద్ద లైన్స్‌ను పర్యవేక్షిస్తుంటారు. ఇందులో భాగంగా అద్దెకు వాహనాలను తీసుకుని పర్యటిస్తుంటారు. సదాశివనగర్ మండలం ఉత్తునూరు గ్రామానికి చెందిన కుంట భైరవ చాలా రోజులుగా ట్రాన్స్‌కోలో రెండు గూడ్స్ వాహనాలను అద్దెకు నడుపుతున్నాడు. ట్రాన్స్‌కో ఒక్కో వాహనానికి ప్రతినెలా రూ.61 వేలు అద్దె చెల్లిస్తోంది. ఇదిలా ఉండగా భైరవకు చెందిన రెండు వాహనాలకు సంబంధించిన మూడు బిల్లులు(మొత్తం రూ.1.83 లక్షలు) పెండింగ్‌లో ఉన్నాయి. ఒక్కో బిల్లుకు నెలకు రూ. 3 వేల చొప్పున, గైర్హాజరైన రోజుకు సంబంధించి రూ.500 కలిపి మొత్తం రూ.12,500 ఇస్తేనే బిల్లులు మంజూరు చేస్తానని ఏఈ రాజు డిమాండ్ చేశాడు. దీంతో భైరవ గత నెల 30న ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో విచారణ జరిపిన పోలీసులు నిందితుడిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు వల పన్నారు. ఇందులో భాగంగా సోమవారం ఏసీబీ అధికారులు ఇచ్చిన డబ్బులను తీసుకుని భైరవ కామారెడ్డి బస్టాండ్ ప్రాంతానికి వచ్చాడు. ఏఈకి ఫోన్ చేసి డబ్బులు తెచ్చానని చెప్పాడు. తాను అందుబాటులో లేనని చెప్పిన ఏఈ.. బస్టాండ్ ప్రాంతంలోని ఓ జిరాక్స్ సెంటర్‌లో డబ్బులు ఇవ్వాలని సూచించాడు. జిరాక్స్ సెంటర్ యజమాని సంతోష్ డబ్బులు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. డబ్బులు తీసుకునేందుకు సంతోష్ వద్దకు వస్తున్న దారిలో ఏఈ రాజును కూడా అదుపులోకి తీసుకుని ఏసీబీ కార్యాలయానికి తరలించారు. అక్కడ దాదాపు మూడు గంటల పాటు విచారించారు. నిందితుడిని కరీంనగర్ ఏసీబీ కోర్టుకు తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపారు.



టోర్నీలో తలపడుతున్న తెలంగాణ కబడ్డీ జట్టు

కూతకూతకూ ఉత్కంఠ..

కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో జాతీయస్థాయి కబడ్డీ పోటీలు ఉత్కంఠగా సాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా క్రీడాభిమానులు పోటీలను చూసేందుకు తరలివస్తున్నారు.

- వివరాలు 8లో ▸

క్లుప్తంగా

ఆర్యసమాజ్‌ తాత ఇకలేరు



భిక్కనూరు: కామారెడ్డి ప్రాంతంలోనే ఆర్యసమాజ్‌ తాతగా పిలువబడే మండంలోని జంగంపల్లికి చెందిన బక్కి నర్సయ్య (103) సోమవారం వేకువ జామున మృతి చెందారు. ఆయన ఈ ప్రాంతంలో తొలిసారిగా జంగంపల్లిలో ఆర్యసమాజ్‌ కేంద్రాన్ని ప్రారంభించారు. అలాగే బ్రహ్మజ్ఞాన ఆశ్రమాన్ని స్థాపించాడు. అలాగే తాడ్వాయి శబరిమాత అమ్మవారికి తొలి శిష్యుడుగా శిష్యరికం పొందాడు. నర్స య్య కొన్నిరోజులుగా విజయవాడలో తన చిన్న కుమారుడి ఇంటి వద్ద ఉంటున్నాడు. సోమవారం అక్కడే ఆయన తుదిశ్వాసను వదిలాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు.

ఓపెన్‌ స్కూల్‌ ప్రవేశాలకు గడువు పెంపు

నిజామాబాద్‌అర్బన్‌: ఓపెన్‌ స్కూల్‌ పదో తరగతి, ఓపెన్‌ ఇంటర్‌ ప్రవేశాలకు దరఖాస్తు గడువును పెంచినట్లు డీఈవో సోమవారం పేర్కొన్నారు. ఈనెల 11వ తేదీ వరకు ప్రవేశాలు పొందవచ్చన్నారు. టీఎస్‌ ఆన్‌లైన్‌, మీ సేవ సెంటర్లలో ప్రవేశ రుసుం చెల్లించవచ్చన్నారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

బాన్సువాడ : పట్టణంలోని మదీనా కాలనీలో సోమవారం షార్ట్‌ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. పట్టణానికి చెందిన ఖాసీం అనే వ్యక్తి ఇంట్లో రాత్రి షాట్‌ సర్క్యూట్‌ కావడంతో మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి



పెర్కిట్‌(ఆర్మూర్‌): అణగారిన వర్గాల అభ్యున్నతికి కేంద్రం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఆహార, ప్రజా పంపిణీ శాఖ సంయుక్త కార్యదర్శి అశ్వని శ్రీవాస్తవ అన్నారు. ఇస్సాపల్లిలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులైన వారు పథకాలను సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలన్నారు. అప్పుడే కేంద్ర ప్రభుత్వ పథకాలకు సార్థకత చేకూరుతుందన్నారు. అలాగే అంకాపూర్‌లో నిర్వహించిన వికసిత్‌ భారత్‌ సంకల్ప్‌ యాత్రలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెంట్రల్‌ బ్యూరో ఆఫ్‌ కమ్యూనికేషన్‌ ఫీల్డ్‌ పబ్లిసిటీ ఆఫీసర్‌ ధర్మ నాయక్‌, ఎల్‌డీఎం శ్రీనివాస్‌రావు, ఆర్డీవో వినోద్‌ కుమార్‌ పాల్గొన్నారు.

సత్వరమే స్పందించాలి

- కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు
- ప్రజావాణికి 63 ఫిర్యాదులు



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్‌: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 63 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్లు చిత్రా మిశ్రా, పి.యాదిరెడ్డి, నగరపాలక సంస్థ కమిషనర్‌ ఎం.మకరందు, డీఆర్డీవో చందర్‌, డీపీవో జయసుధ, నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు అర్జీలు సమర్పించారు. కాగా వినతులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతివారం సమీక్ష

ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లాకు సంబంధించి ప్రజలు అందించే వినతులపై ఆయా శాఖల జిల్లా అధికారులు స్పందించి పరిష్కరించాలని కలెక్టర్‌ రాజీవ్‌ గాంధీ హనుమంతు ఆదేశించారు. రాష్ట్ర స్థాయి ప్రజావాణి కార్యక్రమం వినతులను శాఖలవారీగా పంపిస్తున్నారని, వాటిని వెంటనే పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. వినతులపై చేపట్టిన చర్యలపై వివరిస్తూ సమగ్ర నివేదికలు పంపించాలన్నారు. ఒకవేళ వినతులు పరిష్కారం కాకుంటే, అందుకు గల కారణాలు తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రజావాణి వినతులపై చేపట్టిన చర్యలకు సంబంధించి ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని కలెక్టర్‌ తెలిపారు.

సర్వేనంబర్‌ను సవరించాలని వినతి

నిజామాబాద్‌ రూరల్‌ మండలంలోని సారంగాపూర్‌లో గల తమ భూమి రెవెన్యూ రికార్డుల్లో సర్వే నంబర్‌ తప్పుగా నమోదైందని, వెంటనే సవరించాలని గ్రామ రైతులు ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించారు. సర్వే నంబర్‌ 101/1లో 12 మందికి 30 గుంటల చొప్పున 9 ఎకరాల భూమిని ప్రభుత్వం ఇచ్చిందని గుర్తుచేశారు. భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నించగా అడ్డుకున్నామన్నారు. వారు కోర్టును ఆశ్రయించారని, తాము కూడా కోర్టుకు వెళ్లగా, తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని తెలిపారు. భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, తెలంగాణ డిజిటల్‌ పాస్‌బుక్‌ ఇవ్వాలని కోరారు. అలాగే భూమిని సర్వే చేయించగా, సర్వే నంబర్‌ 92, 47లో తాము సాగు చేసుకుంటున్నామని, కానీ రెవెన్యూ రికార్డుల్లో 101/1 అని ఉందన్నారు. కావున రెవెన్యూ రికార్డులను సరి చేయాలని కోరారు.

ఎండీఎం బకాయి బిల్లులు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సుభాష్‌నగర్‌: మధ్యాహ్నభోజన కార్మికుల ఆరునెలల బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూర్జహాన్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం ఎండీఎం నిర్వాహకుల సమస్యలపై కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండీఎం నిర్వాహకులకు ఆరు నెలలుగా బకాయిలు బిల్లులు రాక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో అప్పులు చేసి ఏజెన్సీలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. స్లాబ్‌రేటు పెంచాలని, గుడ్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రతినెలా బిల్లులు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. నిర్వాహకులు, ఎంఈవోతో జాయింట్‌ సమావేశం ఏర్పాటు చేయాలని, లేకపోతే వంట నిలిపేసి ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు చామంతి లక్ష్మి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కొండ గంగాధర్‌, నాయకులు సురేందర్‌ రెడ్డి, శిరీష, సుజాత, ఏజెన్సీ కార్మికులు పాల్గొన్నారు.

రైస్‌మిల్‌ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

సుభాష్‌నగర్‌: రైస్‌మిల్లుల్లో పని చేస్తున్న ఆపరేటర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్‌ చేశారు. ఈమేరకు సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్‌ ఎదుట ధర్నా నిర్వహించి, ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి ఓమయ్య మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా రైస్‌మిల్‌ ఇండస్ట్రీలో ఆనవాయితీగా ప్రతి రెండేళ్లకోసారి కార్మికుల వేతనాలు పెంచుకుంటున్నామని పేర్కొన్నారు. గత వేతన ఒప్పందం కాలపరిమితి అక్టోబర్‌ 31తో ముగిసిందని, నవంబర్‌ 1నుంచి కొత్త వేతనాలు అమల్లోకి రావాల్సి ఉందన్నారు. కానీ రైస్‌మిల్‌ యాజమాన్యాల నిర్లక్ష్యం వల్ల నేటికీ వేతనాలు పెంచలేదని తెలిపారు. వెంటనే వేతనాలు పెంచడంతోపాటు కార్మికులకు పీఎఫ్‌, ఈఎస్‌ఐ, ఇన్సూరెన్స్‌ సౌకర్యం కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల కార్మికులకు కూడా కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయాలని డిమాండ్‌చేశారు. లేకుంటే సమ్మెకు వెళ్తామని స్పష్టంచేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింగరావు, జిల్లా కార్యదర్శి అనిల్‌, నాయకులు జాఫర్‌, రమేష్‌, బసప్ప, లాయక్‌, ప్రసాద్‌, తిరుపతిరెడ్డి, గంగాధర్‌, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న ఆపరేటర్లు, హెల్పర్లు

ఆరో తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్‌ విడుదల

నిజామాబాద్‌అర్బన్‌: మోడల్‌ స్కూళ్లలో 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు డీఈవో దుర్గాప్రసాద్‌ సోమవారం నోటిఫికేషన్‌ విడుదల చేశారు. ఈనెల 12 నుంచి వచ్చేనెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందన్నారు. ఏప్రిల్‌ ఒకటో తేదీన హాల్‌టికెట్లు డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్‌ 7వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కూతకూతకూ ఉత్కంఠ

- హుషారుగా సాగుతున్న జాతీయ స్థాయి కబడ్డీ టోర్నీ
- రెండోరోజు 16 మ్యాచ్‌లు
- డ్రాగా ముగిసిన తెలంగాణ – ఉత్తరాఖండ్‌ మ్యాచ్‌



తలపడుతున్న తెలంగాణ–ఉత్తరాఖండ్‌ జట్లు

కామారెడ్డి టౌన్‌ : జిల్లా కేంద్రంలో ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల మైదానంలో స్కూల్‌ గేమ్స్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అండర్‌ –17 కబడ్డీ టోర్నీ కొనసాగుతోంది. సోమవారం రెండోరోజు 16 మ్యాచ్‌లు నిర్వహించారు. పోటీలు ఉత్కంఠగా సాగాయి. తెలంగాణ– ఉత్తరాఖండ్‌ల మధ్య జరిగిన మ్యాచ్‌ డ్రాగా ముగిసింది. పోటీలను తిలకించేందుకు అభిమానులు తరలివచ్చారు.

ఉదయం 8 మ్యాచ్‌లు..

ఉదయం సెషన్‌లో ఎనిమిది మ్యాచ్‌లు నిర్వహించారు. తెలంగాణ– ఉత్తరాఖండ్‌ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌ తీవ్ర ఉత్కంఠగా సాగింది. మొదట తక్కువ స్కోరులో ఉన్న తెలంగాణ టీం నెమ్మదిగా పుంజుకుని విజయానికి చేరువైంది. చివరి కూతలో జార్ఖండ్‌ రైడర్‌కు రెండు పాయింట్లు సమర్పించుకోవడంతో మ్యాచ్‌ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్‌లో రెండు జట్లు 39 పాయింట్లు సాధించాయి. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన మ్యాచ్‌లో ప్రేక్షకులు ఈలలు, కేకలతో ఇరుజట్ల ఆటగాళ్లను ప్రోత్సహించారు. జార్ఖండ్‌ క్రీడాకారులు పలుమార్లు మ్యాచ్‌ మధ్యలో అతిగా ప్రవర్తించారు. ఈ క్రమంలో మ్యాట్‌పైనే క్రీడాకారులు నిరసన తెలపడంతో రిఫరీలు వార్నింగ్‌ కార్డులు చూపడంతో వెనక్కితగ్గారు.

ఉత్తరప్రదేశ్‌ జట్టు కేరళ జట్టుపై 50–38 పాయింట్లతో గెలిచింది. కర్ణాటక జట్టు 37–29తో హిమాచల్‌ ప్రదేశ్‌పై, ఢిల్లీ జట్టు 44–30 తేడాతో ఎన్‌వీఎస్‌ జట్టుపై, హర్యానా జట్టు 52–40 తో గుజరాత్‌పై, రాజస్థాన్‌ జట్టు 36–33తో చత్తీస్‌ఘడ్‌పై, బీహార్‌ జట్టు 54–26తో పంజాబ్‌ జట్టుపై, కేవీఎస్‌ జట్టు 51–40తో ఒడిషాపై గెలుపొందాయి.

మధ్యాహ్నం 8 మ్యాచ్‌లు...

మహారాష్ట్ర జట్టు 84–21 పాయింట్ల భారీ తేడాతో జార్ఖండ్‌పై విజయం సాధించింది. జమ్మూకశ్మీర్‌ 66–63 తో సీబీఎస్‌బీఎస్‌వోపై విద్యాభారతి జట్టు 58–26 పాయింట్లతో వెస్ట్‌ బెంగాల్‌పై, తమిళనాడు జట్టు 45–21తో పాండిచ్చేరిపై, గుజరాత్‌ జట్టు 41–23 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్‌పై, చత్తీస్‌ఘడ్‌ 49–46 పాయింట్లతో మధ్యప్రదేశ్‌ జట్టుపై, పంజాబ్‌ జట్టు 45–35 తో సీఐఎస్‌సీఈపై, కేవీఎస్‌ జట్టు 59–38 పాయింట్లతో చండీగఢ్‌పై గెలిచాయి.



టోర్నీలో తలపడుతున్న కేరళ – ఉత్తరప్రదేశ్‌ జట్లు

డిచ్‌పల్లి ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి ఎంపీపీ గద్దె శ్రీనివాస్‌ అలియాస్‌ భూమయ్యపై 12 మంది ఎంపీటీసీలు అవిశ్వాసం ప్రకటించారు. ఈ సందర్భంగా నిజామాబాద్‌ ఆర్డీవో రాజేంద్రకుమార్‌కు సోమవారం తీర్మానం కోరుతూ లేఖను అందజేశారు. డిచ్‌పల్లి మండలంలో 17 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 2019లో జరిగిన ఎన్నికల్లో 11 మంది టీఆర్‌ఎస్‌ పార్టీ, ముగ్గురు కాంగ్రెస్‌ పార్టీ, ఒకరు బీజేపీ, ఇద్దరు స్వతంత్ర్య అభ్యర్థులు విజయం సాధించారు. అప్పటి రూరల్‌ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ ప్రోద్బలంతో బీఆర్‌ఎస్‌కు చెందిన దూస్‌గాం ఎంపీటీసీ గద్దె భూమయ్య ఎంపీపీగా, నడిపల్లి –1 ఎంపీటీసీ కులాచారి శ్యాంరావు వైస్‌ ఎంపీపీగా ఎంపికయ్యారు. అనంతరం జరిగిన పరిణామాలతో ఎంపీపీ, వైస్‌ ఎంపీపీ, సుద్దపల్లి, మెంట్రాజ్‌పల్లి ఎంపీటీసీలు యెంబడి సంతోషం, దుంపాల సౌమ్య బీజేపీలో చేరారు. బీజేపీకి చెందిన ఘన్‌పూర్‌ ఎంపీటీసీ కుర్రి సవితతో పాటు ధర్మారం(బి)–1 ఎంపీటీసీ పులి నర్సింగ్‌రావు, డిచ్‌పల్లి ఎంపీటీసీ లొక్కిడి కొత్తూరు మానస బీఆర్‌ఎస్‌లో చేరారు. ఇటీవల కాంగ్రెస్‌ అధికారంలో రాగానే రూరల్‌ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో ఏడుగురు బీఆర్‌ఎస్‌ ఎంపీటీసీలు కాంగ్రెస్‌ చేరారు. దీంతో కాంగ్రెస్‌ ఎంపీటీసీల సంఖ్య తొమ్మిదికి చేరింది. మిగిలిన వారిలో బీజేపీ ఎంపీటీసీలు నలుగురు, బీఆర్‌ఎస్‌ ఎంపీటీసీలు నలుగురు ఉన్నారు. అవిశ్వాసం కోసం 9 మంది మెజార్టీ సరిపోతుంది. ముల్లంగి(ఐ)కి చెందిన నడిపల్లి–2 ఎంపీటీసీ చిన్నోల్ల నర్సయ్యను ఎంపీపీగా చేయడానికి కాంగ్రెస్‌ ఎంపీటీసీలతో పాటు మిగిలిన నలుగురు బీఆర్‌ఎస్‌ ఎంపీటీసీలు మద్దతు తెలుపడానికి అంగీకరించినట్లు సమాచారం.

ఎంపీటీసీల పదవీ కాలం జూలై 7వ తేదీ వరకు ఉంది. మంగళవారం ఆర్డీవో కార్యాలయం నుంచి డిచ్‌పల్లి ఎంపీడీవో కార్యాలయానికి ఎంపీటీసీ సభ్యుల సంతకాల నిర్ధారణ కోసం లేఖ పంపించనున్నారు.

వీరజవాన్ల కుటుంబ సభ్యులకు చెక్కుల పంపిణీ



నిజామాబాద్‌నాగారం: ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా నుంచి ఆర్మీలో విధులు నిర్వహిస్తూ సర్వీసులో మరణించిన ముగ్గురు సైనికుల కుటుంబ సభ్యులకు సోమవారం కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ, రిటైర్డ్‌ కల్నల్‌ రమేశ్‌కుమార్‌ చెక్కులను పంపిణీ చేశారు. ఆర్మ్‌డ్‌ ఫోర్సెస్‌ ఫ్లాగ్‌డే ఫండ్‌ నుంచి మంజూరు చేసిన ఆర్థిక సహాయ చెక్కులను చెవుల ప్రశాంత్‌ భార్య చెవుల సుకన్య, నీరడి గంగాప్రసాద్‌ భార్య నీరడి శిరీష, ఈగ జైపాల్‌ భార్య స్వరూపకు ఒక్కొకరికి రూ. మూడు లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి డి.రమేశ్‌, సిబ్బంది ఫహీముద్దీన్‌, బదాం గంగా మోహన్‌, లక్ష్మణ్‌, ఉమేర్‌ పాల్గొన్నారు.

ఏఎస్సైపై దాడిచేసిన వారిపై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని మూడో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం రాత్రి ఏఎస్సై నీలికృష్ణపై దాడిచేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపారు. మూడోటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో డ్రంగ్‌ అండ్‌ డ్రైవ్‌ పరీక్ష నిర్వహిస్తుండగా పోలీసులు ఓ వాహనాన్ని ఆపారు. మద్యం మత్తులో ఉన్నవారు ఏఎస్సైపై దాడికి పాల్పడ్డారు. దీంతో నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్‌

మట్కా స్థావరంపై టాస్క్‌ఫోర్స్‌ దాడి



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని మిర్చి కంపౌండ్‌ రైల్వే ట్రాక్‌ పక్కన మట్కా స్థావరంపై సోమవారం టాస్క్‌ ఫోర్స్‌ పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో మట్కా ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్‌ సీఐ అంజయ్య తెలిపారు. వీరి నుంచి రూ. 9,860 స్వాధీనం చేసుకున్నారు.

కరెంట్‌ షాక్‌తో రైతు మృతి



నర్సారెడ్డి మృతదేహం

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి మండలంలోని చందాపూర్‌కు చెందిన అల్లూరి నర్సారెడ్డి(39) అనే రైతు కరెంటు షాక్‌ తగిలి మృతి చెందినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నర్సారెడ్డి అదే గ్రామానికి చెందిన అల్లూరి ప్రకాశ్‌రెడ్డికి సంబంధించిన వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని మొక్కజొన్న పంటను సాగుచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే మొక్కజొన్న పంటకు నీళ్లు పెట్టడానికి చేనులోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు నర్సారెడ్డి కాళ్లకు కరెంటు వైర్లు తగలగా షాక్‌ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై వివరించారు.

దశాబ్దాల నాటి చెట్టుకు నిప్పు



ఎడపల్లి(బోధన్‌): ఒకవైపు ప్రభుత్వం హరితహారం పేరిట ప్రతియేటా చెట్లను పెంచితే.. మరో వైపు దుండగులు చెట్లకు నిప్పు పెడుతున్నారు. ఎడపల్లి మండలం బోధన్‌ – అలీసాగర్‌ ప్రధాన రహదారి పక్కనే దశాబ్దాల నాటి కింది చెట్టుకు నిప్పుపెట్టారు. చెట్లను తగులబెట్టుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



నరేశ్‌(ఫైల్‌)

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం వెంగల్‌పాడ్‌ పరిధిలోని పాటి తండాకు చెందిన లావుడ్య నరేశ్‌(21) అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు ఎస్సై మహేశ్‌ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నరేశ్‌ గతనెల 30వ తేదీ నుంచి తండాలో కనిపించడంలేదు. దీంతో అతని తల్లి నీలాబాయి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేస్తుండగా తిర్మన్‌పల్లి శివారులో రైల్వే ట్రాక్‌ పక్కన నరేశ్‌ మృతదేహాన్ని గుర్తించారు. మృతికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. నరేశ్‌కు ఒక కూతురు ఉంది. పదిహేను రోజుల క్రితం మరో కూతురు జన్మించగా భార్య తల్లిగారి ఇంటివద్దే ఉంటుంది. మృతుడు తిర్మన్‌పల్లిలోని సామిల్లులో పని చేస్తున్నాడు. తాగుడికి బానిసై అప్పులు చేశాడని తెలిసింది. మృతుడి తల్లి ఫిర్యాదుమేరకు హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగులో పడి యువతి..

లింగంపేట: మండలంలోని కొర్పోల్‌కు చెందిన కల్లు సుప్రజ(22) వాగులో పడి మృతి చెందినట్లు ఎస్సై ప్రభాకర్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కల్లు లక్ష్మి, బాల్‌రాజు దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల పెళ్లిళ్లు చేశారు. చిన్న కూతురు సుప్రజ పెళ్లయిన కొద్దిరోజులకే భార్యభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకుని తల్లిదండ్రులతో ఉంటుంది. ఆదివారం తల్లిదండ్రులు బంధువుల ఇంట్లో ఫంక్షన్‌ ఉండగా వెళ్లారు. కూతురును పొలం వద్ద కాపలా ఉండాలని చెప్పడంతో వెళ్లింది. సాయంత్రం తల్లిదండ్రులు వచ్చేసరికి ఇంట్లో లేకపోవడంతో పొలం వద్దకు వెళ్లి వెతికారు. బంధువులు, చుట్టుపక్కల వారికి ఫోన్‌చేసినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం ఉదయం పొలం వద్ద పెద్దవాగులో కూతురు శవమై తేలింది. పంటకు నీళ్లపెట్టే క్రమంలో మూర్ఛ వచ్చి వాగులో పడిన ట్లు గుర్తించారు. సుప్రజ మూర్ఛ వ్యాధితో బాధపడుతోంది. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

బైక్‌ను ఢీకొన్న బోరుబండి

- ప్రమాదంలో యువకుడి మృతి



బాలరాజు (ఫైల్‌)

ఎల్లారెడ్డి: బైక్‌పై ఎదురుగా వస్తున్న యువకుడిని బోరు బండి ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని జంగమయ్యపల్లి శివారులో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగమయ్యపల్లికి చెందిన అక్కం బాలరాజు(19) మత్తమాలలో తన తమ్ముడిని పాఠశాలలో దింపి జంగమయ్యపల్లికి వస్తుండగా ఎల్లారెడ్డి నుంచి రుద్రారం వైపు వెళ్తున్న బోరు బండి ఢీకొట్టడంతో బాలరాజు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోళ్ల పందాల స్థావరాలపై టాస్క్‌ఫోర్స్‌ దాడులు

రుద్రూర్‌: కోటగిరి పోలీస్‌ స్టేషన్‌ పరిధిలోని పోతంగల్‌ శివారులో కోళ్ల పందాల స్థావరాలపై సోమవారం టాస్క్‌ఫోర్స్‌ అధికారులు దాడులు నిర్వహించారు. మంజీర నది శివారులో కోడిపందాలు ఆడుతుండగా నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలంలో మూడు పందెం కోళ్లు, రూ. 29 వేల నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

రాంపూర్‌లో వివాహిత ఆత్మహత్య

- భర్తే చంపాడని మృతురాలి బంధువుల ఆందోళన

రుద్రూర్‌: కోటగిరి మండలం రాంపూర్‌లో సంపంగి మౌనిక(28) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సందీప్‌ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నస్రురుల్లాబాద్‌ మండలం సంగెం గ్రామానికి చెందిన మౌనికకు, కోటగిరి మండలం రాంపూర్‌కు చెందిన మహేశ్‌తో వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. దినసరి కూలీలుగా పని చేస్తారు. ఇటీవల కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం మౌనిక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు చికిత్స నిమిత్తం తరలించే క్రమంలో మరణించింది. మౌనిక మృతి సమాచారం తెలుసుకున్న మృతురాలి బంధువులు రాంపూర్‌కు వచ్చి ఆందోళనకు దిగారు. మౌనికను భర్తనే చంపి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. దీంతో మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఒకరి ఆత్మహత్య

వర్ని: మండలంలోని కోటయ్య క్యాంపు గ్రామానికి చెందిన షేక్‌ నాజర్‌ వలి(36) ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కృష్ణ కుమార్‌ తెలిపారు. కుటుంబ కలహాల వల్ల భార్య పిల్లలు దూరంగా ఉండడంతో మనస్థాపానికి గురయ్యాడని, మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుడి తమ్ముడు షేక్‌ బాజీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

మద్యానికి బానిసై యువకుడు..

బాన్సువాడ: మద్యానికి బానిసై బాన్సువాడ పట్టణానికి చెందిన మేతరి రితిక్‌(23) ఆత్మహత్య చేసుకున్నాడని సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి అతిగా మద్యం సేవించి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని పేర్కొన్నారు. గతంలో కూడా రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడన్నారు. మృతుడి తల్లి లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య



పోశవ్వ(ఫైల్‌)

వర్ని: మండలంలోని పాత వర్నికి చెందిన శావులం పోశవ్వ(61) గ్రామ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కృష్ణకుమార్‌ తెలిపారు. ఆదివారం ఉదయం గ్రామ చెరువులో దూకగా సోమవారం చెరువులో మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కొంతకాలంగా పోశవ్వ అనారోగ్యానికి గురికాగా అదే బాధతో ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి కూతురు కవిత ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.